# పేదరికం

"ఏఁ? ఇవ్వాళన్నా ఇటుతగలడేదుందా ?"
అడిగేవాడు మొగుడు.

"ముదనష్టపుగోల. రోజూ ఒకటేగోల"
అనేది పెళ్లాం.

"సరే! నన్ను చంపు. ఈ గోలవదుల్తుంది"
చెప్పేవాడు మొగుడు.

"యింకేం! పిల్లల్ని ఊ.... కని దరిద్రుల్ని
చెయ్" అంటుంది పెళ్లాం.

"చేసుకున్న మొగుడెటుబోతే యేంలే!"
అనేవాడు మొగుడు.

"కనుకున్న బిడ్డలేమైతేయేంలే!" అనేది
పెళ్లాం.

"నీపుణ్యం వూరుకో. ప్రక్కవాళ్లు వింటారు"
నోరుమూసుకునేవాడు మొగుడు.

"స్వంత ఆస్తులమూలాన్ని ఎన్ని గొడవలు
పుడుతున్నైరా భగవంతుడా!" అనుకునేవాణ్ణి నేను.

రోజూ యిదీవరస. సరిగ్గా నేను మా యింటె
ల్లపాదినీ నిద్రబుచ్చి, కలమూ కాగితాలూ ముందు వేసు

కూర్చోడమూ, వాళ్ళు యీ ప్రణయం ప్రారంభించడమూ ఒకేసారి.

మాయింటి కానుకునే వాళ్లడాబా. అది చాలా పెద్దది కూడాను. ఆ యింట్లో వుండే మనుషులు కూడా దానికి తగినంత పెద్దవాళ్ళూనూ – వాళ్ళు ఒక్కసారికి ఒక్క రైతేనే ఆ డాబాలో ఏవాకిలికైనా సరిపోయేది.

ఇక రెండేళ్లు రెండేళ్ళు తేడాతో ముగ్గురు మగపిల్లలు గూడాను. చంటివాడి కిప్పుడు రెండేళ్ళుంటాయి.

ఆయనకింకా రెండు మేడలున్నాయి. వాటిని అద్దెలకిచ్చుకుని తానీడాబాలో వుంటున్నాడు. ఒక పెద్ద గుడ్డలకొట్టుగూడా వుందట. ఆయన ఇంటినుంచి ఎప్పుడు వెళ్తాడో, ఎప్పుడు తిరిగి వస్తాడో? నిజానికి ఆయన ప్రక్కనే కాపురం యీడుస్తున్న నాకే తెలియదు. సరిగ్గా నేను కవితా సామాగ్రితో సమాధిలో దిగబోయే వేళకు మాత్రం యీ సందడి సాగేది. "ఏం! ఇవ్వాళన్నా యిటు తగలడేదుందా?" అనే ప్రారంభ వాక్యాలతో –

మా యింటికి ఆనుకొనే, యివతలవైపు ఖాళీ చోట్లో ఓ పూరిపాకవుంది. చాలా చిన్నది. చుట్టూ

మేదరితడికలు. అందులోనూ మొగుడూ, పెళ్ళాం, ముగ్గురు పిల్లలూ వుంటున్నారు.

అతను పల్లెటూరివాడు. మొదట్లో బాగా బ్రతికిన సంసారమట. రాగా రాగా ఉన్నకాస్త కొంద్రతోనూ బ్రతకలేక కౌలుపొలాలు చేశాడట. దండగలు తిన్నాడట. కొండనాలుకకి పెడితే ఉన్ననాలుక ఊడినట్టు ఋణాలక్రింద ఉన్నదికాస్త వూడ్చుకుపోయిందట. ఉన్న వూళ్ళో కూలి చేసుకునేందుకు మొగం చెల్లలేదట. బస్తీకిచేరి బండిలాక్కుంటున్నాడు.

వాళ్ళది అదోరకం సంసారం. యిద్దరూ యీడూ జోడూ వయస్సులో వున్నారు.

పొద్దుగూకులూ లాగుడుబండితో సతమతమై వచ్చేవాడు భర్త. యిద్దరూ దీపందగ్గర చేరేవాళ్లు. ఆవేళటి ఆదాయాన్ని లెక్కచూసుకునేవాళ్లు. మరునాటి ఖర్చు బడ్జెట్ వేసేవాళ్లు. ఆతర్వాత నీళ్లుతోడి వీపు తోమేది పెళ్లాం. పిల్లల్ని దగ్గరకూచోబెట్టుకుని ఆ వున్నదేదో తిని మూతి తుడుచుకునేవాళ్లు. కాసేపు పిల్లలతో ఆడుకునేవాళ్లు. పిల్లలు నిద్రబోయింతర్వాత సంసారపు గొడవలూ అవీ గుసగుసలాడేవాళ్ళు. రేపటి బ్రతుకు ఆలోచనల్తో నిద్రబోయేవాళ్లు.

షాహుకారుగారి పెద్దపిల్లవాడు పుస్తకాలు, వెరసులూ చదువుకొంటున్నాడు. మిగతా యిద్దరుపిల్లలూ యింటిదగ్గరే ఎప్పుడూ బిస్కత్తులూ, పంచదారబిళ్లలూ, అరటికాయలూ ఒకటేమిటి? వాళ్లు కావాలనుకున్నవన్నీ జేబుల్లో కుక్కుకునేవాళ్లు. ఒక్కొక్కటే తీసి పొరుగు పిల్లల్ని వూరిస్తూ తింటూండేవాళ్ళు.

ఇంట్లోనించి వాళ్లమ్మ "ఓరి వెధవల్లారా! ఎవళ్ళకళ్లు ఎలాంటివో! యింట్లోకి చావరేం?" అని ఒక్క కేక పెట్టేది. ఎక్కడపిల్లలక్కడ గప్‌చుప్... అసలాబజార్లో మాకు దగ్గరగా పిల్లలున్నది యీ రెండిళ్ళలోనే.

షాహుకారిగారి పిల్లలు గాలిపటాలు ఎగరవేశేవాళ్ళు. రైళ్లు, కార్లు, పోలీసులు రకరకాల బొమ్మలు తెచ్చి బజార్లో దుకాణం తెరిచేవాళ్లు. ఆట సాగించే వాళ్లు పాపం ఆపూరింటిపిల్లలుకూడ వచ్చి కూర్చునేవాళ్లు. వాళ్ళకూడా వాటిని తాకిచూతామనిపించేది. కాని అంటుకోనిచ్చేవాళ్లుగాదు.

"ఓరేయ్ - మీకుకాదురా చెప్పేది? వాళ్లు దొంగవెధవలు. ఎత్తుకుపోతారు. ఇంట్లోకి చావరేం." అని గద్దించేది వాళ్ళమ్మ. అసలే ఘనకాయంనుంచి వచ్చే కేక; ఆపైన డాబా ప్రతిధ్వని. పేటపేటా దద్దరిల్లేది.

"రండి. నాయనా! యిక్కడాడుకుందురు

గాని—'' అని పిల్లల్ని తీసుకుపోయేది పూరింటావిడ. ఏమామిడి టెంక గానుగో, మట్టిబొంగరమో చేసియిచ్చేది. 'ఎంతచెట్టు కంతేగాలి' కదూ. కాని పిల్లలికి యీ వేదాంతం బోధపడేది కాదు.

రోజులాగానే పూరింటావిడ 'పున్నాగపూలు ఏరుకోవటానిక'ని డాబా వెనుకదొడ్లోకి వెళ్లింది. డాబా యింటావిడ జలకమాడుకోంది. కొద్దిపాటి గున్నమామిడిలా కూర్చొని-

''ఏం ? అన్నీ అగపడుకుంటూ ఆకోక కట్టుకున్నావేం ?'' అన్నది.

ఒక్కసారి చిరుగుల కోకవంక చూసుకొని ''పొట్టకే చాలటంలేదు. యింకా బట్టకేమొస్తదీ ?'' అన్నది పూరింటావిడ.

''అట్టాంటి మొగుడితో కాపరం చెయ్యలేకపోతే యేం ?'' అన్నది ఆభాగ్యశాలి.

''ఎట్టాంటి మొగుడితో చెయ్యాలి''? అనలేకపోయింది ఆ పేదరాలు.

''మా ఆయనచూడు ఎలాంటి కోకలు తెస్తాడో'' అన్నది ఆ లావాంటి శరీరం.

''ఐతే మీ ఆయన్ని పెట్టుకొని వుండమంటావా ?'' అన్నట్లయితే ఆ చువ్వలాంటి అమ్మాయి...

''ఆఁ! ఆ! అదే అదే-'' అనేది ఆ విలువైన యిల్లాలు.

కాని మెదలకుండా వూరుకొంది. యీ తేలిక పిల్ల-పేదతనమంటే ఏమిటీ? గడ్డిపోచకంటే తేలిక.

''నేను నీకు మంచికోకలు దొరికే ఉపాయం చెప్పేదీ?'' అడిగింది ఆ చిన్న తలకాయ (ఆశరీరానికి మాత్రమే)

పాపం చిన్నబుచ్చుకొని గిర్రున తిరిగి వెళ్లిపోయిందా యమ్మాయి.

ఆ సాయంత్రమే డాబా వాకిటికి సరిపోనూ కూర్చొని చెరిగిపోస్తోంది ఆ యిల్లాలు.

పూరింటావిడ రోడ్డుమీద నుంచున్నది. నెత్తురు కార్తొన్న పిల్లవాణ్ణి ముందు బెట్టుకొని.

''చూడండి! రాయిబెట్టి ఎట్లా కొట్టాడో.''

''కొడితే తిరుగురాయిబెట్టి మా అబ్బాయిని కొడతానంటావా''

''కొట్టేమాత్రపు వాళ్లమైతే మాగ తెందుకిల్లా వుంటది?''

''అబ్బో! మీ ఆయనేగాంగ సంపాయించి పోస్తున్నాడనా?''

''సంపాయించే మాత్రపు వాళ్లైతే.''

"ఆడు సంపాయించకపోతే నీవుబయల్దేరా. చక్కటి చుక్కవేగా ?"

"..................."

"పిల్లలు కొట్టుకున్నారంట. అడగొచ్చింది. తానేగాగా కన్నది ఓ కోతిని." దులిపేసింది డాబాయింటావిడ—

"ఎవరిపిల్లలు వాళ్ళకే ముద్దు" పాకాలో దూరిందా యమ్మాయి.

చుట్టూ పది కొంపలలోనుంచి పదికిపైగానే బయటికొచ్చారు.

"చింత చచ్చినా పులుసు చావలేదు"

"అసలిట్టాంటి రకాన్ని చేరనియ్యటమేతప్పు."

"కూటికి లేనిదానికి నీలెందుకో—"

"ఎత్తొచ్చినముండ దానికేం ? ఇరవైఆరంటది."

"నీకెందుకు నీవు పోవమ్మా తల్లీ. నీకేమైనా తిట్లయినా చాతైతే అనుకోవచ్చు."

"ఇదుగో రేపుచెపుతా దీనిపని. ఆచోటెవడి దనుకొందో." అలాగే వీధివీధంతా మోతలెత్తించింది. ప్రొద్దుకూకింది. పూరిపాకలో—

"నలిగున్నమ్మా తొలిగుండమనీ-కాలం. పోనీ అట్లానే."

"రేపు యిక్కణ్ణించి వెళ్లగొట్టేస్తదట."

"హాశ్శీ! యిందుకేనా ఏడ్వటం? పుట్టి పెరిగినగడ్డే పోయింది. యికయిదా? ఉన్నమ్మకొాకటేవూరు. అడుక్కుతినే దానికి అర వైఆరూళ్లు. దీనికేనా? మనమేం ఎవరినోళ్లు కొట్టడంలా. చాకిరి చేస్తున్నాం బ్రతుకుతున్నాం."

ప్రొద్దుపోయింది. డాబాలో-

"మరి యివాళన్నా..." అడిగాడు మొగుడు,

"ముదనష్టపుగోల - రోజూ ఒకటేగోల" అన్నది పెళ్లాం.

"గోల లేకుండా చెయ్యరాదూ?" అడిగాడు మొగుడు.

"అందుకే. మొలలోతు గోలయింది." చెప్పింది పెళ్లాం.

"ఏమిటీ!?... యిటరా-యిట్రా."

"..............."